


## 26

కోపూరి పుష్పాదేవి

# సాలోచన

అప్పటిదాకా అవనికి అదురుపుట్టించిన ఆదిత్య కిరణాలను తరిమికొడుతూ మేఘమాలికలు పరుగు పరుగున వచ్చాయి. చల్లని గాలిని తోడుతెచ్చుకొని జగతికి ఆహ్లాదాన్ని పంచాయి. ఆ తాత్కాలిక విజయానికి మురిసిపోతూ అవి ఆనందభాష్పాలను రాల్చాయి.

“అమ్మో... వాన పెద్దదవుతుందేమో... మీనాన్న ఎక్కడున్నారో ఏమిటో...అసలే జ్వరంతో ఉండి బయటకు వెళ్ళద్దంటే వెళ్ళారు” కంగారుపడింది కాత్యాయని.

“నువ్వేమీ గాభరాపడకమ్మా... ఈ వాన ఇప్పుడే తగ్గిపోతుంది. నాన్న ఏమీ తడిసిపోరులే” వీక్లీ చూస్తూనే తల్లిని సమాధానపరిచింది సుమ.

“సరేగానీ సుమా... నాన్నగారు నీతో ఒక విషయం చెప్పమన్నారు” అంది కాత్యాయని సుమ పక్కనే సోఫాలో కూర్చుంటూ.

“ఏమిటమ్మా అది?” ఓ కథ ఆసక్తిగా ఉండడంతో చదువుతూనే అడిగింది తల్లి ఒడిలో వాలి.

“అదేనే... నీ పెళ్ళి విషయం. ఇకనైనా సంబంధాలు చూద్దామని. నీ ఫోటో, బయోడేటా ఆ స్వర్గం మేరేజ్ లింక్స్ వాళ్ళకిద్దామని”



"అబ్బబ్బ మళ్ళీ మొదలుపెట్టారా ఆ గొడవ... కొన్నాళ్ళు ఆగమన్నానా...?"

"ఇంకెన్నాళ్ళే...? చదువు అయ్యేవరకూ చదువు చదువు అన్నావు. అదయ్యాక ఉద్యోగం అన్నావు. యేడాదినుంచీ చేస్తున్నావు గదా, ఇక ఇప్పుడు సంబంధాలు చూస్తామంటే ఇంకా కొన్నాళ్ళు ఆగమంటావేమిటి...?" కోపంతో కాత్యాయని ముఖం ఎర్రబడింది.

"అంతకోపం ఎందుకమ్మా... ఇంక కొన్నాళ్ళేలే... పుస్తకం లోంచి చూపు తిప్పకుండానే అంది సుమ.

"ముందా పుస్తకం అవతల పడెయ్... నేనింత గోలపెడ్తున్నా నీకు చీమ కుట్టినట్లన్నా ఉండదేమిటే..." అంటూ సుమ చేతిలోని వీక్లీ లాక్కుని అవతల పడేసింది కాత్యాయని.

సుమ ఎమ్.ఎస్.సి ఫిజిక్స్ చేసి కాకరపర్తి భావనారాయణ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేస్తోంది. తల్లిదండ్రులకు ఆమె ముద్దుల కూతురు. ఇద్దరు అన్నల మురిపాల చెల్లెలు. ఆమె పెద్దన్న వినయ్ భోపాల్లో పి.డబ్ల్యూలోనూ, చిన్నన్న వివేక్ అదే ఊళ్ళోనూ ఇంజనీర్లుగా చేస్తున్నారు. వినయ్ పెళ్ళయింది. ఒక పాప కూడా.

"నువ్వూ త్వరగా పెళ్ళి చేసుకొని నాకు లైన్ క్లియర్ చెయ్యవే... నేను ముదిరిన బెండకాయనవుతున్నాను" అని వివేక్ సుమని సరదాగా ఆట పట్టిస్తుంటాడు.

"అమ్మా, రేపు మా కాలేజ్‌లో ఒక మీటింగ్ ఉంది. దానికి నిన్నూ, నాన్ననూ కూడా తీసుకువెళ్తాను. ఆ తర్వాత నా పెళ్ళివిషయం మాట్లాడుకుందాము" అంది సుమ తల్లి భుజం మీదికి వంగి గారాబం పోతూ.

"ఆ మీటింగ్‌కీ, నీ పెళ్ళికీ సంబంధమేమిటే...?"

"వెళ్ళొచ్చిన తర్వాత మీకే తెలుస్తుందిగా..." అంటూ నవ్వి తల్లి అవతలపడేసిన వీక్లీని మళ్ళీ అందుకుంది సుమ.

× × ×

కె.బి.యన్ కాలేజ్ ఆడిటోరియమ్ ప్రేక్షకులతో కిటకిటలాడుతోంది. వేదిక ప్రముఖులతో కళకళలాడుతోంది. "సన్మాన గ్రహీత చిరంజీవి కాంచనకు అభినందనలు" అని వ్రాసి ఉన్న అందమైన ఫ్లెక్సీ బ్యానరు వేదికపై వెలుగులు చిమ్ముతోంది. సభాధ్యక్షునిగా కళాశాల ప్రిన్సిపాల్, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు శ్రీధర్, ఆత్మీయ అతిథిగా పేరుపొందిన వైద్యులు వెంకటేశ్వరరావు, కాంచన మరో ఇద్దరు ప్రముఖులు వేదికపై ఆసీనులై ఉన్నారు.

"ఈరోజు ఒక మంచి కార్యక్రమానికి మా కళాశాల వేదిక అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది" అంటూ ప్రిన్సిపాల్‌గారు తొలిపలుకులుగా కొద్దిసేపు మాట్లాడి, మొదటగా కలెక్టరుగారిని మాట్లాడమన్నారు.

అతను ముప్పయ్యయిదేళ్ళు దాటని యువకుడు. విద్యవలన కలిగిన వినయం, ఉద్యోగం తెచ్చిన హోదా రెండూ కలిసి అతనికి ఒక వింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. అతను ముందుగా వేదికపైనున్న పెద్దలకూ, సభాసదులందరికీ నమస్కరించి తన ఉపన్యాసం మొదలుపెట్టాడు.

"నాకీవేళ చాలా ఆనందంగా ఉంది. ఎంతో సంతోషంగా ఉంది. ఎందుకంటే నేనీ కళాశాల పూర్వవిద్యార్థిని. ఈ అధ్యాపకులనూ, ఈ భవన సముదాయాన్నీ, ఈ చెట్లనూ చూస్తుంటే పాతరోజులు గుర్తొస్తున్నాయి. మళ్ళీ అప్పటి విద్యార్థిని అయినట్లుగా ఉంది. ఈ గురువుల ఆశీర్వాదం వల్లనే నేనీవేళ ఈ స్థాయికి వచ్చాను. అందుకు వీరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను." అన్నాడు. ఆయన మాటలకు కరతాళధ్వనులు మారు మ్రోగాయి.

ఆయన తన ఉపన్యాసం కొనసాగిస్తూ ఇకపోతే సన్మానగ్రహీత కాంచన గారి గురించి చాలా చాలా చెప్పాలి. "మనమందరం సాధారణంగా ఏం చేస్తుంటాం...?" అంటూ అతను ఆ చిన్న ప్రశ్నను ప్రేక్షకులకు సంధించి ఒక్క నిముషం ఆగాడు. సభలో నిశ్శబ్దం రాజ్యమేలింది. సమాధానం కూడా అతనే చెప్తూ మనం ఎప్పుడూ మన గురించీ మన పిల్లల గురించీ, మన ఇంటి గురించీ ఆలోచిస్తూ ఉంటాం. ఇంకా ఏం చేస్తే మనం ఇంకా ఇంకాపైకెదగగలుగుతామనే ఆలోచన తప్ప, చుట్టుపక్కలవారి గురించి కానీ, ప్రపంచం గురించి కానీ మనం ఆలోచించేది చాలా చాలా తక్కువనే చెప్పాలి. కానీ, కొందరు ఆదర్శ వ్యక్తులు ఉంటారు. వారు ఎల్లప్పుడూ సమాజం గురించే ఆలోచిస్తూ ఉంటారు. ఆ సమాజాభివృద్ధి కోసమే పాటుపడుతుంటారు. ఉదాహరణకు గాంధీ, నెహ్రూ, పటేల్ మొదలైనవారు. వారి కోవలోనిదే ఈ కాంచన. ఈమె నాకు జూనియరు. అప్పట్లో కాలేజ్ బ్యూటీ. గొప్ప వైద్య దంపతుల గారాల పట్టి. బ్రైట్ స్టూడెంట్. కాలేజ్‌కి వచ్చినా ఒక మహారాణిలాగే ఉండేది. చుట్టూ ఎప్పుడూ పదిమంది విద్యార్థులతో కళకళలాడుతూ తిరిగేది. ఈమె కోరితే కోటిమంది వరులు బారులు తీరేవారు. విదేశాలకెగిరిపోయి, కోట్లు సంపాదించి అపురూపమయిన జీవితాన్ని ఆస్వాదించవచ్చు. కానీ, ఈమె వాటినన్నిటినీ తృణప్రాయంగా భావించింది."

"మరి, ఇప్పుడు ఏం చేస్తోంది?" అది మీ సందేహం. అవునా... సమాజానికి చీడపురుగులని అందరూ భావించే వీధిబాలలను చేరదీస్తోంది. వారిని అమ్మలా ఆదరిస్తోంది. వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారి సర్వతోముఖ వికాసానికి తన శాయశక్తులా కృషిచేస్తోంది. దొంగలుగా, జూదరులుగా, హంతకులుగా మారబోయే వారిని సంస్కరించి, చక్కని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతోంది. ఇంకా ఏం చేస్తోందో తెలుసా...? కన్న బిడ్డల ఆదరణ కోల్పోయిన వృద్ధులను ఆదరిస్తోంది. వారిని అన్నివిధాలా ఆదుకుంటోంది. మదర్ థెరీసా వంటి మహోన్నతమైన ఇటువంటి కుమార్తెను కన్నందుకు ఈమె తల్లిదండ్రులను మనసారా అభినందిస్తున్నాను" అంటూ కలెక్టర్ శ్రీధర్ మరికొంతసేపు విద్యార్థులకు ఉపయోగపడే విషయాలు కొన్ని చెప్పి, కాంచన గారి సన్మాన కార్యక్రమంలో తనకూ భాగం కల్పించినందుకు కళాశాలవారికి కృతజ్ఞతలు తెలుపుతూ కరతాళధ్వనుల మధ్య తన ఉపన్యాసాన్ని ముగించాడు.

తరువాత మిగతా వక్తలు కూడా కాంచన కృషిని వేనోళ్ళ పొగుడుతూ, ఆమెను అభినందిస్తూ మాట్లాడారు.

ఆ తరువాత కాంచన తండ్రి డాక్టర్ వెంకటేశ్వరరావుగారు మాట్లాడుతూ, అప్పుడు మా

అమ్మాయి తనకు పెళ్ళి వద్దన్నందుకు మేము చాలా బాధపడ్డాం. ఎంతో విచారించాం భర్తా, పిల్లా పాపలతో ఆమె కళకళలాడుతుంటే చూడాలని తల్లిదండ్రులుగా తపించాం. కానీ, ఈనాడు అప్పటి మా మూర్ఖత్వానికి చింతిస్తున్నాం. చిన్నవయసులోనే పెద్దమనసుతో సమాజానికి తన జీవితాన్ని అంకితం చేసి జన్మ సాఫల్యం చేసుకున్న మా అమ్మాయిని చూసి ఇప్పుడు గర్విస్తున్నాం. ఆమెను కన్నవారిగా ఉప్పొంగిపోతున్నాం." అన్నారు.

మరోసారి కరతాళధ్వనులు మిన్నంటాయి. తరువాత కాంచనకు కలెక్టరు గారి చేతులమీదుగా ఘనసన్మానం జరిగింది.

చివరగా కాంచన తన స్పందన తెలియజేస్తూ, మీరందరూ నా తపనను గుర్తించినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. కలెక్టరుగారు నన్ను మదర్ థెరిసాతో పోల్చారు. నేను అందుకు అర్హురాలను కాకపోయినా మీ అందరి సహకారంతో ఆమె అడుగుజాడల్లో నడవడానికి ప్రయత్నిస్తాను. నన్ను అర్థం చేసుకుని, ఈ మార్గంలో నన్ను ప్రోత్సహిస్తున్న నా తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నన్ను ఆదరించిన కళాశాలవారికీ, ఈ సభకు పిచ్చేసి నన్ను ఆశీర్వదించిన మీ అందరికీ కూడా మనఃపూర్వక కృతజ్ఞతలు" అని ముగించింది. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలతో సభ జనరంజకంగా సాగింది.

xxx

"అవునమ్మా సుమా... ఆ మీటింగ్‌కి వెళ్ళివచ్చాక నీ పెళ్ళి విషయం గురించి చెబుతానన్నావు. ఇక ఇప్పుడైనా ఆ సంగతి తేల్చుతావా లేదా...?" తల్లీ, తండ్రీ ఇద్దరూ ఒక్కసారిగా సుమమీదకు దండెత్తారు.

ఇంతలో డోర్ బెల్ మ్రోగింది. కాత్యాయని వెళ్ళి తలుపు తీసింది. మనోహర్ వచ్చాడు." వివేక్ ఉన్నాడా?" అంటూ అడిగాడు.

"వివేక్ చిన్నపని మీద బయటకు వెళ్ళాడు. తను వచ్చేవరకు మిమ్మల్ని ఉండమన్నాడు." అని చెప్పి, అతనికి మంచినీళ్ళిచ్చి, హాల్లో ఫ్యాను వేసి, డైలీ పేపరు అందుబాటులో పెట్టి లోపలికి వచ్చింది కాత్యాయని.

తన జవాబుకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న అమ్మానాన్నలతో "ఇంకా నా అభిప్రాయం అర్థం కాలేదా?" అంది సుమ.

"అంటే నువ్వు కూడా ఆ కాంచనలాగా పెళ్ళీ గిళ్ళీ లేకుండా సంఘసేవ చేస్తానంటావా?" కాత్యాయని ఒంటికాలిపై లేచింది కూతురితో యుద్ధానికి.

"అంత త్యాగం చెయ్యలేనుగానీ, నేనూ ఆ దారిలోనే నడవాలని నిర్ణయించుకున్నాను. నన్ను అర్థం చేసుకుని సహకరించేవాడు దొరికితేనే పెళ్ళి. లేకుంటే లేదు."

"అయితే నువ్వు జీవితాంతమూ కన్యగానే ఉండిపోతావు పెళ్ళీ పెటాకులూ లేకుండా" గంగ వెర్రులెత్తి పోతున్నాడు సుధాకరరావు.

"ఫరవాలేదు నాన్నా... అలా అయినా నాకేమీ ఇబ్బంది లేదు. కానీ, నా లక్ష్యాన్ని మాత్రం నేను వదిలి పెట్టను." స్థిరలక్ష్యం ఆమె కంఠంలో గంభీరతను నింపింది.

"నీకీపిచ్చి ఎక్కడ పట్టుకుందే తల్లీ...? పెళ్ళీ, పిల్లలూ వద్దంటూ ఒంటికాయ సొంటికొమ్ములా ఎన్నాళ్ళుండగలవు...? నీకు జీవితాంతమూ మేము తోడుంటామనుకుంటున్నావు కాబోలు... అలా జరగదే వెర్రిదానా... మంచి సంబంధం చూస్తాం. హాయిగా పెళ్ళిచేసుకో... ఏ యాభయ్యేళ్ళో, అరవయ్యేళ్ళో వచ్చాక అప్పుడు సమాజసేవ చేద్దువు గాని... మమ్మల్నిలా దుఃఖపెట్టకే అమ్మా..." కాత్యాయని కన్నీళ్ళతో కూతుర్ని వేడుకున్నది.

"ప్లీజ్ అమ్మా... నన్నుఅర్థం చేసుకోండి..."

"ఏమిటే నిన్ను అర్థం చేసుకునేది...? పోనీలే ఒక్క అమ్మాయివి అని చిన్నతనం నించీ గారాబంగా, ప్రేమగా పెంచినందుకు మాకు నువ్విచ్చే బహుమానం ఇదా...? నువ్వు పెళ్ళీ గిళ్ళీ వద్దంటే సంఘంలో మా పరువేం కావాలి...? సుధాకరరావు ఉగ్రనరసింహమూర్తి అయ్యాడు.

ఇంతలో కర్టెన్ తొలగించుకొని మనోహర్ లోపలకు వచ్చాడు. "నన్ను క్షమించండి... మీ కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుంటున్నందుకు. హాల్లో కూర్చున్న నాకు మీ మాటలు వినబడ్డాయి. అందులో నాకు అవసరమయిన విషయం వచ్చింది కనుక మీరు పిలవకుండానే లోపలకు వచ్చాను. ప్లీజ్ క్షమించాలి." అన్నాడు.

"మా మాటల్లో మీకు అవసరమయిన విషయమూ...? అసలు ఎవరు మీరు...?" అయోమయంగా అడిగాడు సుధాకరరావు.

"నాన్నా, ఇతను మా సీయీవో మనోహర్. మన పోలీస్ కమీషనర్ గారి అబ్బాయి." అంటూ పరస్పర పరిచయాలు చేశాడు, అప్పుడే వచ్చిన వివేక్.

"మా మాటల్లో మీకు పనికి వచ్చే విషయం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది సుమ.

"నాలో ఎప్పటినుండో అస్పష్టంగా కదలాడుతున్న భావాలకు మీ మాటలు ఒక రూపాన్ని ఏర్పరిచాయి. అందుకు మీకు కృతజ్ఞతలు" అన్నాడు మనోహర్ కాత్యాయని తెచ్చిన కాఫీకప్పు అందుకుంటూ.

"కొద్దిగా అర్థమయ్యేలా చెప్పండి ప్లీజ్" అంది సుమ తనూ ఒక కప్పు తీసుకుంటూ.

"ఇందులో అర్థం కానిది ఏమీ లేదు. నాకూ మీలాగా సమాజసేవ చెయ్యాలని గాఢమైన అభిలాష ఉంది. కానీ, ఏ విధంగా ప్రొసీడ్ అవ్వాలో ప్లాన్ లేదు. మీకు ఒక ఆలోచన ఉంది కనుక మీ కృషిలో నేనూ భాగం పంచుకుంటాను. మీకు అభ్యంతరం లేకపోతే ఈ మార్గంలో మనిద్దరం సాగుదాం" అన్నాడు మనోహర్.

వీళ్ళ సంభాషణను ఆశ్చర్యంగా వింటున్నారు వివేక్, కాత్యాయని. "అంటే పిచ్చివాళ్ళు ఒకరికి ఇద్దరు తోడయ్యారన్నమాట..." అన్నాడు సుధాకరరావు ఆవేశాన్ని అణచుకుంటూ.

"మీరలా అనుకున్నా ఫరవాలేదంకుల్. గాంధీ, నెహ్రూ, మదర్‌థెరీసాలాంటివాళ్ళందరూ పిచ్చివాళ్ళయితే, మేమూ పిచ్చివాళ్ళమే" నవ్వుతూ అన్నాడు మనోహర్.

తనకొక మంచితోడు దొరికినందుకు మనసులో ఆనందిస్తూ తన తండ్రిని అతడెలా సమాధానపరుస్తాడా అని ఆసక్తిగా గమనిస్తోంది సుమ.

"కానీ, వాళ్ళు ప్రత్యేకమయినవాళ్ళు" అని ఇంకేదో చెప్పబోతున్నాడు సుధాకరరావు.

"పుట్టినప్పుడూ, పెరిగినప్పుడూ వాళ్ళూ ప్రత్యేకమయిన వాళ్ళే మీ కాదంకుల్. వాళ్ళూ అందరిలాంటి సామాన్యులే... కానీ, కొంత వయసు వచ్చాక, వారి భావాలు పరిణతి చెందడం ప్రారంభించాయి. స్వార్థభూతాన్ని జయించి, వారు సమాజ సేవకు తమ సర్వస్వం ధారపోశారు. అందువల్లనే మనకీనాడు మార్గదర్శకులయ్యారు. ఆదర్శమూర్తులయ్యారు."

"నేను పెళ్ళిచేసుకుందామని ఎంతోమంది వధువులను వెతికాను. మంచి చదువులు చదివినవారినీ, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నవారినీ, ఎంతోమంది అందగత్తెలనూ కూడా చూశాను. కానీ, వారెవరిలోనూ కనిపించని శోభ ఒకటి నాకు సుమగారిలో కన్పిస్తోంది...!"

"ఏమిటో అది...?" దాచుకుందామన్నా

దాగని వ్యంగ్యం సుధాకరరావు గొంతులో పెల్లుబికింది.

"అది వ్యక్తిత్వ శోభ. అవును నిజం... త్యాగశీలత, కార్యదీక్ష సమపాళ్ళుగా రూపుదిద్దుకున్న వ్యక్తిలో వెల్లివిరిసే అపురూప శోభ."

"అవునా...?"

"అవును. మనకి మంచి చదువులు, తెలివితేటలూ, చురుకుదనమూ అన్నీ ఉన్న యువతరం ఉంది. దేశంలో సమస్యలూ లెక్కలేనన్ని ఉన్నాయి. యువరక్తం పూనుకుంటే ఆ సమస్యలన్నింటినీ సులువుగా పరిష్కరించవచ్చు. కానీ, అందరం "నాకెందుకు లేనిపోని గొడవలు... నేలదీసి నెత్తిన రాసుకున్నట్లు... నేను బాగానే ఉన్నాను గదా... అనే నిర్లిప్త పంథాలోనే పయనిస్తున్నాం".

"మరి..." ఏదో చెప్పబోయాడు వివేక్.

"ఆగు వివేక్, మరొక్కమాట. మన సమాజంలో పెళ్ళాడటానికి వయసు, సంపాదన, ఆస్తిమాత్రమే అర్హతలుగా భావిస్తున్నాం. అది సరికాదేమోనని నాకు అనిపిస్తూ ఉంది."

"అంటే...?"అడిగాడు వివేక్ మనోహర్ ఏం చెప్తున్నాడో అర్థంకాక.

"పిల్లలు చక్కగా పెరగాలని తల్లిదండ్రులు డబ్బు ఖర్చుపెట్టి వారి అన్ని అవసరాలూ తీరుస్తారు కదూ..."

"అయితే..." అన్నాడు సుధాకరరావు అతను ఎటునుంచి ఎటు వెళ్తున్నాడో తెలియక అయోమయంగా.

"ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు చేస్తేనే గానీ, ఆ అవసరాలు అన్నీ తీరవు. గవర్నమెంటు అన్ని సౌకర్యాలు చేస్తుండబట్టే మనం ఇన్ని సౌఖ్యాలూ అనుభవిస్తున్నాం."

"అబ్బో... వాళ్ళు అవన్నీ వూరికే ఏమీ చెయ్యడంలేదు. అన్నిటికీ బోలెడు బోలెడు టాక్సులు కడుతున్నాం." చేతులు తిప్పాడు ఆయన.

"నిజమే అంకుల్... మీరు చెప్పింది అక్షరాలా నిజం. కానీ, కనీ పెంచిన అమ్మానాన్నలకు డబ్బు ఇచ్చి ఋణం తీర్చుకోగలమా...?"

"అదెలా కుదురుతుందీ...?"

"ఇదీ అంతే అంకుల్... వారు కన్నవాళ్ళయితే, ఇది మాతృభూమి. సంపాదనపరులమయ్యామని, సంబరపడిపోయి, పెళ్ళిచేసుకుని, పిల్లల్ని కనేసి, ఇక ఇరవై నాలుగు గంటలూ వారికోసమే బతికినట్లుండటం కాదు, మన ధర్మంగా, మన కర్తవ్యంగా మాతృదేశానికి మనమూ కొంత చేశాం, అని భావించి నప్పుడే..."

"అప్పుడే..." అడిగాడు వివేక్ ఆతృతపట్టలేనట్లు.

"పెళ్ళాడటానికి నిజమైన అర్హత వస్తుందని నా అభిప్రాయం." ఏమంటావు వివేక్.

కాత్యాయనీ, సుధాకరరావులు సాలోచనగా మనోహర్ వైపు చూశారు.

"ఓ మనోహర్... ఇంకేమంటాను... నువ్వు నా మిత్రుడివైనందుకు గర్వపడుతున్నానంటాను. మా చెల్లి కృషిలో భాగం పంచుకునే మంచి తోడు దొరికిందంటాను." గబుక్కున లేచివచ్చి మనోహర్ని గాఢాలింగనంలో ఉక్కిరిబిక్కిరి చేశాడు వివేక్.

సుమ చిరునవ్వుతో అతడిపై అభినందనల వర్షం కురిపించింది.

# ఎప్పుడో చీకటయ్యేది..!

డాక్టర్ గూటం స్వామి

కల్మషంలేని
ఏడుపంటే వాళ్ళదే...!
ఉంగా... ఉంగా అంటూ
తరంగాల్లా వినిపించే బుజ్జాయి ఏడుపు
బాలింతల చెవులో పడగానే
చెవుల పచ్చిదనం వల్ల
గగుర్పాటుకు లోనవుతారు
పాలిండ్లు పొంటేన్లు అవుతాయి
పొత్తికడుపులో ఒకలాంటి కంపనలు
తెరల మానమౌతాయి...!
ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న
మాతృత్వపు మమకారం
భళ్ళున విచ్చుకుంటుంది.
లాలపోసేటప్పుడో
లాలిపాడేటప్పుడో
సున్నితమైన పాదాలతో
సుతారంగా తన్నినప్పుడో
తల్లిమనస్సు
పులకరింతల కొలను లౌతాది
బిడ్డ ఏడుపులోని స్వచ్ఛతకు
తల్లి ప్రేమలోని మధిరిమకు
శాశ్వత హక్కుదార్లు వారేమరి...!
లేకపోతే లోకం ఎప్పుడో చీకటయ్యేది...!
భూమి నిలువునా భద్దలయ్యేది...!